## క్లుప్తంగా

### రోగులకు సకాలంలో వైద్యసేవలు



రోగి కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

**విజయనగరం ఫోర్ట్:** ఆసుపత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. సర్వజన ఆసుపత్రిలోని ఐసీయూ, పలు వార్డులు, ఓపీ విభాగాలు, ల్యాబొరేటరీలను ఆయన బుధవారం పరిశీలించారు. వైద్యులు సమయానికి వస్తున్నారా, మిమ్మల్ని చూశారా, మందులు ఇస్తున్నారా.. అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరుగుదొడ్లు, వార్డులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆపరేషన్ చేయాల్సిన వారికి సకాలంలో చేయాలన్నారు.

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

- జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు



గదల సన్యాసి నాయుడు

**నెల్లిమర్ల రూరల్:** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో అధికార టీడీపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గదల సన్యాసినాయుడు విమర్శించారు. మండలంలోని కొండవెలగాడలో బుధవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఓటర్లు వేసుకోలేని దౌర్భాగ్య స్థితి నెలకొందన్నారు. ఓడిపోతామని తెలిసి రెండు చోట్లా అన్ని పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, పక్క మండలాలకు చెందిన ఓటర్లతో ఓట్లు వేయించి అడ్డంగా దొరికిపోయారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో గెలవలేమని సీఎం చంద్రబాబు ప్రజలకు స్పష్టమైన సంకేతాలు పంపించారన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి ఎన్నికల్లో గెలిచినప్పటికీ ప్రజల మనసులను ఎన్నటికీ గెలవలేరన్నారు. ఎన్నికలు ఎలా జరిగాయో రాష్ట్ర ప్రజలు చూశారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

### వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలను రానీయొద్దు..

- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**విజయనగరం ఫోర్ట్:** వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలను రానీయొద్దు అని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని విదేశీ స్వదేశ కంపెనీల ఎగుమతి దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలు అనుగుణంగా మార్పులు చేసిందన్నారు. ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధర విధానం ఉండదన్నారు. కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధిని ఎత్తేసిందన్నారు. ఎరువుల పరికరాలపై రాయితీలు కోత విధించిందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సిద్ధం

**విజయనగరం టౌన్:** ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు దివ్యాశీస్సులతో త్రైతసిద్ధాంతం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ గురజాడ కళాభారతి వేదికగా నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్టు ప్రబోధసేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు పేర్కొన్నారు. గురజాడ కళాభారతిలో బుధవారం ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటూ జ్ఞానప్రసంగాలు, నాటికలు, భగవద్గీత శ్లోకాల పోటీలు ఉంటాయన్నారు. గతేదాది మాదిరిగానే జిల్లా కేంద్రంతో పాటూ నెల్లిమర్ల, గజపతినగరం, రాజాం, బొద్దాం, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 20న భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు నాయుడు, రామకృష్ణ, సూరిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలి

**విజయనగరం అర్బన్:** సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవంగా నవంబర్ 23న నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ నంబరు 862ను నాస్తికులు, హేతువాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ భారత నాస్తిక సమాజం, భారత హేతువాద సంఘం సమష్టి ఆధ్వర్యంలో విజయనగరం కోట జంక్షన్ వద్ద జీవో ప్రతులను చించి నిరసన తెలిపారు. వివిధ సంస్కృతులు, విశ్వాసాలు కలిగిన ప్రజల ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైన ఆధ్యాత్మిక వ్యక్తి శత జయంతిని అధికారిక వేడుకగా నిర్వహించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారత హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య, భారత నాస్తిక సమాజం జిల్లా ప్రధాన కార్యదర్శి బంకురు జోగినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌పీ కృష్ణప్రసాద్, బండి శ్రీనివాస్, ఎం.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్‌లో గాడి తప్పుతున్న పాలన

- భోగాపురం ప్రాజెక్టులో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 11 సెక్టార్లకు నలుగురే సూపర్‌వైజర్లు
- కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ లోపం



భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయం

**పూసపాటిరేగ :** భోగాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టులో పాలన గాడి తప్పుతోంది. ప్రాజెక్టులో వున్న సెక్టార్లకు సరిపడా సూపర్‌వైజర్లు నియామకం కాకపోవడం, వున్న సూపర్‌వైజర్లు, పీవో కార్యాలయానికే పరిమితి కావడం తదితర కారణాలతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ లోపిస్తుందనే విమర్శలు వున్నాయి. భోగాపురం సెక్టారు పరిధిలో పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాలకు చెందిన 272 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. వాటిని పర్యవేక్షించడానికి నలుగురు సూపర్‌వైజర్లు మాత్రమే వుండటంతో పాలన పక్కదారి పడుతోంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బదిలీలో ప్రాజెక్టుకు వచ్చిన కొత్త సూపర్‌వైజర్లు కేంద్రాలను పూర్తి స్థాయిలో సందర్శించకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. భోగాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 11 సెక్టారులకు సంబంధించి పూసపాటిరేగ మండల పరిధిలో గల గోవిందపురం, రెల్లివలస, పూసపాటిరేగ, కోనాడ, డెంకాడ మండల పరిధిలో అక్కివరం, డెంకాడ, మోపాడ, భోగాపురం మండల పరిదిలో భోగాపురం, సవరవిల్లి, ముక్కాం, రావాడ సెక్టార్లు వున్నాయి. వీటిన్నింటిని కేవలం నలుగురు సూపర్‌వైజర్లను మాత్రమే నియమించి పర్యవేక్షణ చేయమనడంతో పాలన సాగడం లేదు. కేంద్రాలు విజిట్ అంతంత మాత్రమే వుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భోగాపురం ఐసీడీఎస్ సెక్టారు పరిధిలో 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 62 మిని అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. వాటిలో 1003 మంది గర్భిణులు, 84 మంది బాలింతలు, 6నెలల నుంచి ఏడాది వయసు గల 1184 మంది చిన్నారులు, సంవత్సరం నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులు 3818 మంది, మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులు 2012 మంది, జీరో నుంచి ఆరు నెలలలోపు చిన్నారులు 840 మంది వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సూపర్‌వైజర్ల నియామకం చేసి అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు హాజరు శాతం పెంచి నిర్వహణను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### సూపర్‌వైజర్ల కొరత నిజమే..

భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్లు కొరత వుంది. ఈ కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. నలుగురు సూపర్‌వైజర్లు కేంద్రాలను పర్యవేక్షించి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. డిప్యూటేషన్‌పై సూపర్‌వైజర్లు నియామకం అయ్యే విధంగా ఉన్నత అధికారులను ఇప్పటికే కోరాం.

– సుజాత, ఏసీడీపీవో, భోగాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు

# ర్యాగింగ్‌కు పాల్పడితే బంగారు భవిష్యత్ నాశనం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్



ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్



పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

**డెంకాడ:** విద్యార్థులు తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకున్నట్టే అని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. డెంకాడ మండలం చింతలవలస ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంయుక్తంగా ర్యాగింగ్ నిరోధంపై బుధవారం నిర్వహించిన న్యాయఅవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యా సంస్థ లోపలగాని, వెలుపలగాని ప్రత్యక్షంగా, పరోక్షంగా ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినట్టు తేలితే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తారన్నారు. కాలేజీ నుంచి డిస్మిస్ చేస్తారన్నారు. ఏ కళాశాలలో కూడా చేరకుండా నిరోధించే చట్టం ఉందన్నారు. విద్యార్థులు సోదర, సోదరీ భావంతో మెలగాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్–15100కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు, స్క్వాడ్‌లను, గ్రీవెన్స్ బాక్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.వి.సీతారామరాజు, ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్‌ఐ సన్యాసినాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన

**భోగాపురం:** మండలంలోని రెడ్డికంచేరు గ్రామంలో పారిశుద్ధ్య పనులను డీపీఓ డి.మల్లికార్జునరావు బుధవారం పరిశీలించారు. గ్రామం విమానాశ్రయానికి దగ్గరగా ఉండడంతో హోటల్స్, షాపులు గ్రామంలో వెలసినందున చెత్త, వ్యర్థాలు ఎక్కువగా ఉంటాయని, వాటిని ప్రతిరోజు క్రమం తప్పకుండా తొలగించి శుభ్రం చేయాలన్నారు. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ సమగ్రతే లక్ష్యం



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్ నల్లనయ్య

**విజయనగరం:** దేశ సమగ్రత, సౌభ్రాతృత్వానికి త్రివర్ణ పతాకం స్ఫూర్తిగా నిలుస్తుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ జంక్షన్ (బాలాజీ జంక్షన్) నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా మయూరి జంక్షన్ వరకు సాగింది. ఈ ర్యాలీలో నగరపాలక సంస్థ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని వివిధ దశల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంతోమంది త్యాగధనుల ప్రాణార్పణ ఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్య దినోత్సవ ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య ప్రాధాన్యత వెల్లివిరిసే విధంగా చేయాలన్నారు.

# కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

**విజయనగరంఫోర్ట్:** కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఏపీ రైతు సంఘం కార్యదర్శి బి.రాంబాబు ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్ దేశాలు మన ఎగుమతులపై అధిక సుంకాలు విధిస్తున్నా, వారికి లొంగిపోయి మౌనంగా ప్రధానమంత్రి మోదీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్వామినాధన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరం మేరకు ఎరువులు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ, రైతు సంఘం నాయకులు రాములు, పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వన్‌స్టాప్ సెంటర్‌తో బాధిత మహిళలకు భరోసా



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సాయి విజయలక్ష్మి తదితరులు

**విజయనగరం ఫోర్ట్:** బాధిత మహిళను అదుకునేందుకు వన్‌స్టాప్ సెంటర్ వివిధ రకాల సేవలను అందిస్తోందని ఆ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయి విజయలక్ష్మి అన్నారు. అవసరమైనవారు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 181 హెల్ప్ లైన్ నంబరు కూడా అందుబాటులో ఉంటుందన్నారు. బుధవారం వన్ స్టాప్ సెంటర్ కార్యాలయంలో వాల్ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో బహిరంగ ప్రైవేటు, పని చేసే ప్రదేశాలు, అంతర్గతంగా కుటుంబంలో హింసకు గురైన మహిళలకు అండగా నిలవడమే వన్‌స్టాప్ సెంటర్ ఉద్దేశమన్నారు. వయస్సు, తరగతి, కులం, విద్యార్హతలు, వైవాహిక స్థితి, జాతి, సంస్కృతితో నిమిత్తం లేకుండా శారీరకంగా, లైంగికంగా, భావోద్వేగాల పరంగా మానసికంగా, ఆర్థికంగా దుర్వినియోగానికి గురైన మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ అండగా నిలిచి సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శోభారాణి, కౌన్సిలర్ రమాదేవి, పారా లీగర్ రాణి, అనిత, వెంకటలక్ష్మి లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాల ఆకస్మిక తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

**విజయనగరం:** విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల పలు సచివాలయాలను అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పూల్‌బాగ్ కాలనీలో గల 2వ నంబరు సచివాలయంతో పాటు విజయలక్ష్మినగర్‌లో గల 4వ నంబరు సచివాలయాలను తనిఖీ చేశారు. ముందుగా సచివాలయాలకు చేరుకున్న ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టీలను గమనించారు. కార్యదర్శులు విధుల నిర్వహణ ఏ విధంగా చేపడుతున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడుతూ మెరుగైన పౌర సేవలను అందించి, ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు సక్రమంగా అమలయ్యే విధంగా కార్యదర్శులు జాగ్రత్త వహించాలన్నారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా చూడాలన్నారు. కష్టతరమైన సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పని తీరుని మెరుగుపరుచుకుని సకాలంలో పుర సేవలందే విధంగా చూడాలన్నారు.

# అధ్యాపకుల నిరసన



నల్ల బాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

**విజయనగరం అర్బన్:** రాష్ట్రంలోని అన్ని విభాగాలల్లో ప్రభుత్వ బదిలీలు చేపట్టినప్పటికీ ఉన్నత విద్యా శాఖలో బదిలీలు చేపట్టకపోవడం పట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూజీసీ స్కేల్స్ ప్రకారం జీతాలు తీసుకుంటున్నప్పటికీ తగిన డిజిగ్నేషన్ ఇవ్వకపోవడం విచారకరం అని వారు పేర్కొన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో రీడిజిగ్నేషన్ అమలవుతున్నా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని కంపల్సరీ వెయిటేజీ నిబంధనలు ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అసోసియేషన్, జీసీటీఏ, జీసీజీటీఏ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో భోజన విరామ సమయంలో అధ్యాపకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 18న ధర్నా నిర్వహించనున్నట్టు ప్రభుత్వానికి నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఉమామహేశ్వరరావు, సహ అధ్యాపకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు మోసాలను గుర్తించి బుద్ధి చెప్పండి

- నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాలు



45వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కూటమి హామీల అమలు తీరును వివరిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లు

**విజయనగరం:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు, ప్రస్తుత కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలే గుర్తించి, తగిన తీర్పు చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. విజయనగరం నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రకటించి నేడు ఆ హామీని తుంగలోకి తొక్కటం నిజం కాదా అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు రాని నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని చెప్పి నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం, సోషల్ మీడియా విభాగం నాయకులు ఉష, కృష్ణవేణి, రాణి, అనూష, జ్యోతి, సుజాత, నందిని, ప్రశాంతి, ఉష, దీప, సౌజన్య, పరమేశ్వరి, ఉషారాణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

**28, 50 డివిజన్‌లలో....**

నగరంలోని 28, 50 డివిజన్‌లలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం రెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్‌లు జాకీర్ హుస్సేన్, పట్టా ఆదిలక్ష్మి పార్టీ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం హామీల అమలు తీరుపై ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు లక్ష్మణరావు, బొంగ భానుమూర్తి, సత్తి అచ్చిరెడ్డి, సిరికి గణపతి, దత్తి అజయ్, జంగపు రమణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



సుంకరిపేట గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

**సుంకరిపేట గ్రామంలో..**

మండలంలోని సుంకరిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోల మన్మథకుమార్, మండల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల సూర్యప్రకాష్, సర్పంచ్ సుంకర దుర్గారాజు, వైస్ సర్పంచ్ సుంకరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సువ్వాడ సత్యనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో దోమల నియంత్రణకు చర్యలు

**విజయనగరం:** నగరంలో దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం ప్రజారోగ్య సిబ్బంది పలు ప్రాంతాలలో దోమల వృద్ధి కేంద్రాల్లో ఆయిల్ బాల్స్‌ను విడిచిపెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. చెరువులు, కుంటలు, కాలువలలో నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకించి తయారు చేసిన ఆయిల్ బాల్స్‌ను విడిచిపెట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి వేశారు. పనులను పర్యవేక్షించిన కమిషనర్ మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి ఆయాచోట్ల ఆయిల్ బాల్స్‌ను విడిచిపెట్టామన్నారు. ఆయిల్ బాల్స్ పిచికారీ విధానంలో కొత్త పద్ధతిని ఈసారి ప్రయోగిస్తున్నట్టు చెప్పారు. ఆయిల్ బాల్స్‌ను చిన్నచిన్న గోనె సంచులలో మూటగా కట్టి ఐదు రోజుల పాటు నిల్వ ఉంచిన తర్వాత వాటిని నీటి నిల్వ కేంద్రాల వద్ద విడిచిపెట్టడం జరుగిందన్నారు. ఈ విధానం వల్ల సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు కూడా దోమల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎక్కడా నీరు నిలవ లేకుండా చూడాలన్నారు. కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఎమ్మెల్సీ పెనుమత్స, ఎమ్మెల్యే మాధవి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి

**నెల్లిమర్ల:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబల్ల సుధారాణి అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం గతేడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే అధికారంలోకి వచ్చిందని, ఆ ఏడాది అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఎందుకు రైతులకు మంజూరు చేయలేదని బొప్పడాం సర్పంచ్ కిరణ్ కుమార్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ ఏడాది కూడా అర్హత కలిగిన రైతుల్లో చాలామంది రైతుల ఖాతాలకు పెట్టుబడి సాయం జమకాలేదన్నారు. గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణ భారంగా మారిందని, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు ప్రభుత్వమే చెల్లించాలని టెక్కలి సర్పంచ్ స్వామినాయుడు కోరారు. సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సాయంత్రం 6 గంటల తర్వాత మందుబాబులు వచ్చి సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని వైద్యాధికారి సమావేశంలో ప్రస్తావించారు. రీసర్వేతో పలు గ్రామాల్లో భూ సమస్యలు తలెత్తాయని పలువురు సభ్యులు తహసీల్దార్ శ్రీకాంత్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శనం పాల్గొన్నారు.

## సీపీఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి



కొండగుంపాంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

**నెల్లిమర్ల రూరల్:** ఒంగోలులో ఈ నెల 23 నుంచి జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండగుంపాం గ్రామంలో బుధవారం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలు, విభజన హామీల అమలు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికోసం సమావేశంలో చర్చించి పోరాటాలకు సమాయత్తమవుతామన్నారు. ప్రజాసంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజా మద్దతు అవసరమని, అన్నివర్గాల ప్రజలు మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాపారావు, గౌరినాయుడు, సూరి, పైడినాయుడు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకస్వాములు

**నెల్లిమర్ల రూరల్:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం అనంతరం.. ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం స్వామిని సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

## నెల్లిమర్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



నెల్లిమర్లలో హరఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు



భోగాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

**నెల్లిమర్ల/భోగాపురం:** నెల్లిమర్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి రామతీర్థం జంక్షన్ వరకు భారత్ మాతకీ జై అనే నినాదంతో ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో చైర్ పర్సన్ సరోజిని, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్, నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం, ఎంఈవో సూర్యనారాయణ మూర్తి, డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- భోగాపురం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సభ్యులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమలంలో విజిలెన్స్ ఏపీడీ పద్మజ, ఏపీఓ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.